క్లుప్తంగా

ముగిసిన అజ్జాలమ్మ జాతర


అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: గ్రామ దేవత అజ్జాలమ్మ వారి జాతర మహోత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంభం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు అఖండ అన్నసమారాధనలో పాల్గొన్నారు. సర్పంచ్ చెలంకూరి చలపతిరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు శింగులూరి నాగేశ్వరరావు, తోట రాంబాబు, చందన చిన్నా, తోట దుర్గారావు, వర్థినేని లక్ష్మీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి స్వామికి కిరీటం సమర్పణ


స్వామివారికి కిరీటాన్ని సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీవిజయ గణపతి స్వామివారికి దాతలు ఇత్తడి కిరీటాన్ని, రూ 25 వేలు విరాళాన్ని అందించారు. శుక్రవారం పట్టణానికి చెందిన తోట శేషమ్మ బ్రహ్మయ్య జ్ఞాపకార్థం తోట డోలాసాయి, తోట మణిరత్నం ఇత్తడి కిరీటాన్ని సమర్పించారు. అలాగే వంగ నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులు రూ.25 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


మేడిది జాన్సన్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భీమవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు మేడిది జాన్సన్ అన్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్‌గా నియమితులైన మేడిది జాన్సన్‌ను శుక్రవారం పలువురు నాయకులు అభినందించారు. స్టేట్ అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుంటి ప్రభు, బేతాళ సంతోష్, నక్క అశోక్, కుచ్చినపల్లి రాజేంద్ర, సోడదాసి యాకోబు తదితరులు జాన్సన్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

దళితపేటలో వసతులు కల్పించాలి


పంచాయతీ అధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉండి: మండలంలోని అర్తమూరు పెదపేటలో మౌలిక వసతులు కల్పించాలంటూ స్థానికులతో కలిసి సీపీఎం నాయకులు శుక్రవారం పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ అర్తమూరు పెదపేటలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని, వర్షం వచ్చిన తరువాత నీరు రోడ్లపైనే నిలుస్తుందని అన్నారు. అలాగే డ్రెయినేజ్ లేకపోవడంతో పారిశుద్ధ్య దారుణంగా ఉందని మండిపడ్డారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, పెదపేటకు చెందిన స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: తాడేరు, గునుపూడి, తాడేరు గాంధీనగర్ ఫీడర్స్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించేందుకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీతమ్మ సెంటర్, నల్లం వారి తోట, భేతని పేట, నాచు వారి సెంటర్, పోతుల వారి పేట, గురువు పేట, బంగ్రోతులవారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: విద్యుత్ లైన్లను మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విస్సాకోడేరులో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే పాలకోడేరు, మోగల్లు, కోరుకొల్లు గ్రామాల్లో ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో ఉన్న శ్రీ మావుళ్లమ్మను దసరా ముగింపు రోజు సందర్భంగా గురువారం రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. అమ్మవారిని వేలాది మంది భక్తులు అమ్మవారి ని దర్శించుకున్నారు. సుమారు రూ.10 లక్షల వ్యయంతో తయారు చేసిన రథాన్ని ప్రముఖ వ్యాపారవేత్త మద్దుల శ్రీరామచంద్రమూర్తి కుమారులు నాగ వెంకట దుర్గ ప్రసాద్, శ్రీనివాస నాగ భూషణం అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు దాతలు మద్దుల ప్రసాద్ కుటుంబంతో కలిసి రథాన్ని లాగి రథోత్సవం కార్యక్రమం ప్రారంభించారు. అమ్మవారిని ఉండి ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణరాజు దర్శించుకున్నారు

వీరవాసరంలో..

వీరవాసరం: శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల్లో గురువారం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వీరవాసంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలోనూ, తోలేరులో శ్రీ ప్రసన్న కనకదుర్గాదేవి ఆలయంలోనూ, రాయకుదురు, కొనితివాడ, మడుగు పోలవరం ,అండలూరు, తోలేరు, చింతల కోటి గరువు, మత్స్యపురిపాలెం, మత్స్యపురి, బాలేపల్లి ,మెంటేపూడి, దూసనపూడి, పెరికిపాలెం తదితర గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారని ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో శంకర రఘు, సూర్య సంతోష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


భీమవరం (ప్రకాశంచౌక్): రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు


వీరవాసరం: అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు


ఆకివీడు: కనకదుర్గమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను శుక్రవారం పట్టణంలోనూ, గ్రామాల్లో ఊరేగించి, గ్రామోత్సవం నిర్వహించారు. గరగలు, శక్తి వేషాలతో భారీగా ఊరేగింపు నిర్వహించారు. స్థానిక పెద్దింటి అమ్మవారిని ఆలయం వద్ద నుంచి ప్రత్యేకంగా తయారుచేసిన వాహనంలో ఊరేగించారు. దుంపగడప రైల్వే గేటు వద్ద ఉన్న కనకదుర్గమ్మను, మారెమ్మ గుడి, నూకాలమ్మ గుడి వద్ద ఉన్న అమ్మవార్ల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి గంగమ్మ ఒడికి చేర్చారు.

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

భీమవరం: గాంధీజీ ఆశయాలను పాలకులు తుంగలోకి తొక్కుతున్నారని, గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకుని హౌసింగ్ బోర్డు కాలనీలో సీపీఐ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాలా త్రిమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో..

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా భీమవరం శ్రీరాంపురంలోని గాంధీకస్తూరిబా భవనంలో శాంతి ప్రదర్శనలు, ర్యాలీ నిర్వహించారు. గాంధీ జీవితాంశాల ఆధారంగా ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. గాంధీతత్వం నేటి భారతం అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్వోదయ మండలి కార్యదర్శి ప్రసాదరాజు, మంతెన ఝాన్సీ, బొండా సుబ్బారావు, మానవత చైర్మన్ వెంకటపతిరాజు, సీహెచ్ రంగసాయి పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపకారాగారంలో..

జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవితాల నుంచి స్ఫూర్తిని పొందాలని భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా భీమవరం ప్రత్యేక ఉప కారాగారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముద్దాయిగా జైల్లో ఉన్న వారు పరివర్తన చెంది మంచి మనిషిగా సమాజంలోకి రావాలని హితవుపలికారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. న్యాయమూర్తుల చేతుల మీదుగా జైలు పరిసరాలలో మొక్కలు నాటారు. జైలు సూపరింటెండెంట్ డి.వెంకటగిరి, ఒకటో అదనపు సివిల్ జడ్జి పి.హనీష, రెండో అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ (న్యూటన్) తదితరులు పాల్గొన్నారు.


భీమవరం: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


భీమవరం: ప్రత్యేక ఉప కారాగారంలో మాట్లాడుతున్న బి.లక్ష్మీనారాయణ


ఆకివీడు: గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేస్తున్న దృశ్యం


పాలకుడేరు: గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

ఆకివీడులో..

ఆకివీడు: ప్రపంచానికి గాంధీజీ శాంతి మార్గమే ఆదర్శమని నగర పంచాయతీ చైర్మపర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కోఆప్షన్ సభ్యురాలు మన్నే లలితాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఉప కారాగారంలో గాంధీ జయంతి వేడుకలు

పాలకోడేరులో..

పాలకోడేరు: మహాత్మా గాంధీ జయంతిని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వి. రెడ్డియ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాంప్రసాద్, ఎంఈఓ పి.వెంకట శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఊరట


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కోటేశ్వరరావు


ఉత్పత్తులను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: జీఎస్టీ తగ్గింపుతో మధ్య తరగతి పేద వర్గాల ప్రజలకు ఊరట కలుగుతుందని బీజేపీ నాయకుడు అల్లూరి సాయి దుర్గరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని స్వచ్ఛంద సంస్థ సభ్యులతో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మాట్లపూడి సత్యనారాయణ, ఎం.పాండు రంగారావు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఎంఎస్ఎంఈ, చేనేత, హస్తకళల ఉత్పత్తులకు జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ రెండో వారం ప్రచార కార్యక్రమం అమలులో భాగంగా భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎంఎస్ఎంఈ, చేనేత, హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శనను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ బి.శివనారాయణరెడ్డి, వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ కేపీ శైలజ , జిల్లా పరిశ్రమల అధికారి యు.మంగపతి రావు, ఎల్డీఎం ఎ.నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అత్యుత్సాహంతో వ్యక్తికి పాము కాటు

ఉండి: వ్యవసాయాధికారుల అత్యుత్సాహం ఓ వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చింది. ఉండిలో అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌ను గురువారం ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగ రాణి చేతులమీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమం అనంతరం జీఎస్టీ తగ్గింపులతో వ్యవసాయ పనిముట్లు కొనుగోలులో రైతులు ఎంతో మేలు పొందుతున్నారనే ప్రచార ర్యాలీ నిర్వహించేందుకు నియోజకవర్గంలోని ట్రాక్టర్‌లను పెద్ద ఎత్తున ఉండి ఏఎంసీకి తరలించారు. ఉదయం 10 గంటలకు అని చెప్పిన ర్యాలీ కాస్త మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్లు చెట్ల నీడకు చేరుకున్నారు.దీనిలో భాగంగా ఉండి మండలం ఉప్పులూరు నుండి ట్రాక్టర్‌తో సహా వచ్చిన డ్రైవర్ గోపే సందీఫ్ ఏఎంసీ కార్యాలయానికి పక్కనేవున్న షెడ్‌లో ఫోన్ మాట్లాడుకుంటూ కూర్చున్నాడు. ఇదే సమయంలో అతని చేతిపై తాచుపాము కరిచింది. దీంతో బాధితుడిని పలువురు ట్రాక్టర్ డ్రైవర్లు హుటాహుటీన ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స చేసి సందీప్‌ను భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే స్థానిక వ్యవసాయాధికారులు మాత్రం సాయంత్ర సమయంలో బాధితుడిని పరామర్శించడంపై స్థానికులు మండిపడ్డారు.


భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సందీప్

వీరవాసరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

వీరవాసరం: స్థానిక పీహెచ్‌సీను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారులు సమ్మెలో ఉన్న కారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఎలా పని చేస్తున్నాయో? తెలుసుకోవడానికి తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌తో మాట్లాడి పీహెచ్‌సీ ల్యాబ్ , వ్యాక్సిన్ రూమ్, ఇతర విభాగాల పనితీరును పరిశీలించారు.

వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించాలి

భీమవరం: భీమవరం, గొల్లవానితిప్ప, నాగేంద్రపురం గ్రామాలలో యనమదుర్రు డ్రెయిన్‌పై కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి వంతెనలు నిర్మించి అప్రోచ్ రోడ్లను మర్చిపోయిన పాలకులకు గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన వంతెనలు అప్రోచ్ రోడ్లు లేక నిరుపయోగంగా మారాయని మండిపడ్డారు. ఓ పక్క నూటికి నూరు శాతం సమస్యలు పరిష్కరించామని సభల ద్వారా ప్రచారం చేసుకుంటున్నా పాలకులకు ఈ వంతెనలు కనపడటం లేదా అంటూ ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఇంజేటి శ్రీనివాస్, ఎం.వైకుంఠరావు ఎం .ఆంజనేయులు, రేవు రామకృష్ణ, చల్లబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సుల ద్వారా ఉద్యోగ అవకాశాలు

భీమవరం అర్బన్: విద్యార్థులు విద్యతో పాటు ఒకేషనల్ కోర్సుల్లో ఇప్పటి నుంచే ప్రావీణ్యం సాధిస్తే భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని పీఎం శ్రీ ఏపీ సమగ్ర శిక్ష జిల్లా అధికారి సీఎంఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని గూట్లపాడు హైస్కూల్ విద్యార్థులకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ఇంటర్న్ షిప్ ప్రొగ్రాంలో భాగంగా డిజిటల్ సేవలపై శుక్రవారం శిక్షణ తరగతులు ర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సెలవుల్లో ఐటీ, ఐటీఈఎస్ ట్రేడ్ విభాగాలలో శిక్షణ పొందాలన్నారు. హెచ్ఎం సత్యవాణి, వీసీ సంజీవ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.


ఐటీ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

చిన్నారులు, సువాసినిలకు సత్కారం

ఆకివీడు: అభం, శుభం తెలియని చిన్నారులే దేవుళ్లని, సువాసినిలే అమ్మవార్లగా భావించి పలువురు చిన్నారులు, సువాసినిలను ఘనంగా సత్కరించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో విజయదశమి సందర్భంగా గురువారం ఆలయ కమిటీ చైర్మన్, కార్యదర్శులు గొంట్లా గణపతి, కాకర్ల రాజరాజేశ్వరిలు సత్కరించారు. అనంతరం ఆలయంలో చండీహోమం నిర్వహించి, పూర్ణాహుతి నిర్వహించారు.

మాలధారులకు ఉచిత భిక్ష

ఆకివీడు: అయ్యప్ప మాలధారులందరికీ ఉచిత అల్పాహారం, భిక్షను 75 రోజుల పాటు ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు నూకల రామదాసు గురుస్వామి చెప్పారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలోని ముత్యాల మాణిక్యం, రామాకాంతం జ్ఞాపకార్థం నిర్మించిన కమ్యూనిటీ హాలులో అయ్యప్ప స్వాములు, శివ మాలాధారులు, భవానీలు, వేంకటేశ్వరస్వామి మాలాధారులందరికీ అల్పాహారం, భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రూరల్ బ్యాంక్ చైర్మన్ ముత్యాల రత్నం, గురు స్వాములు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు పని కల్పించాలి

ఉండి: అర్హులైన పేదలందరికీ వందరోజుల పని కల్పించాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి మదాసి గోపీ కోరారు. శుక్రవారం పాందువ్వలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.సూర్యనారాయణరాజుకు కేవీపీఎస్ తరఫున వినతిపత్రం అందజేశారు.

శ్రీ మూలేశ్వర శతకం ఆవిష్కరణ


శ్రీ మూలేశ్వర శతకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: రాయకుదురు శ్రీ ఉమా మూలేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీ మూలేశ్వర శతకం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శతకాన్ని ఈ తరానికి వినసొంపుగా ఉండేలా గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి శ్రీనివాస్, గీతా కుసుమ కుమారి దంపతులు తమ సొంత ఖర్చులతో × ఆడియో–వీడియో × రూపంలోకి తీసుకువచ్చారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గెద్దం భారతి, ఆలయ ఈఓ కొండవీటి రామచంద్రరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అద్దాల శ్రీరామ చంద్ర మూర్తి (రాము), రాయకుదురు ఎంపీటీసీ సభ్యుడు కడలి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పింఛన్లు వెంటనే విడుదల చేయాలి


సంక్షేమ పెన్షన్లు విడుదల చేయాలని వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): సంక్షేమ పింఛన్లు వెంటనే విడుదల చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఎన్. రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పెన్షన్లు వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు, డప్పు కళాకారులు, చర్మకారులకు చెందిన సంక్షేమ పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సేన పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షులు ఉండ్రాజవరపు కృష్ణ, దళిత సేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలించాలి


రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ఉండి: రీ-సర్వేపై రైతుల నుండి స్వీకరించిన ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.రీసర్వే ఫేజ్-2లో భాగంగా మండలంలోని పాందువ్వలో శుక్రవారం గ్రామ రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రీసర్వే ఫేజ్-2లో భాగంగా 675 మంది రైతుల భూములను రీసర్వే చేయగా వారిలో 225 మంది రైతుల నుంచి విస్తీర్ణంలో తేడాలు వచ్చాయని అప్పీల్ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రీ-సర్వే అధికారి కె.జాషువా, డివిజన్ సర్వే అధికారి మల్లికార్జునరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.